కవితా కౌముది

# రంగుల చీకటి

జి.సునీల్ కుమార్

సూర్యాస్తమయాన్ని చూస్తున్నప్పుడు
రేపటి సూర్యోదయాన్ని చూస్తానా లేనా అన్న సంశయం నాలో లేదు
ఎందుకంటే
నల్లని ఆకాశంలో మిలమిల మెరిసే నక్షత్రాలని చూస్తూ
ఆ కోట్లాది నక్షత్రాల నడుమ ఎన్నో భావ చిత్రాలు గీస్తూ
ఆనంద డోలికలో మునకలేస్తాను కాబట్టి

పగటి కంటే రాత్రికే సొబగులు ఎక్కువ

చీకటి ఎంత చిక్కనైనది
చీకటి ఎంత గొప్పనైనది
నా గుండె సడి నాకే వినిపిస్తోంది
నా కనురెప్పల అలికిడిలో నన్ను మేలుకొలుపుతోంది
అయినా ఎవరైనా
ఒక్క నిమిషం ఆగి
గడియారపు శబ్దాన్ని విని ఆనందించే
మనసు ఎందరికుంటుంది?

చీకటి చెక్కిలిపై పూసిన సిగ్గుల్లా మిణుగురులు
చీకటి పాటకి కోరస్ లా కీచురాళ్ళు
కవి  నిశీది సాగర మథనం లో పుట్టిన కావ్య కన్యలు ఎంతో మంది కదా
కోట్ల రంగుల కలల్ని సృష్టించేది ఈ నల్లని చీకటి అంటే
ఎంతో ఆశ్చర్యంగా లేదా

కలువ పూలకు కాటుకైన చీకటి
కన్నె ఎదకు కానుకైన చీకటి
సృష్టి రహస్యమంత చీకటి చుట్టేగా అల్లుకుంది

మిన్నులో తారలు ఏకాంతం లేక చిర్రు బుర్రు మంటుంటే
చంద్రుని వెచ్చని శ్వాస నుండి జాలువారే వెన్నెల మాత్రం మత్తు జల్లుతోంది

రాత్రి ఓ అధ్యాయం లాంటిదే
దాన్ని చదివే మనసు కొందరికే వుంటుంది
రాత్రి ఓ అద్దం లాంటిదే
దాన్ని ప్రతిభింబించే హృదయం కై ఎదురు చూస్తూ వుంటుంది
నిజానికి
మన గుండెల నిండా ముసురుకున్న చీకటి కంటే
ఈ నిశీధి అంత నల్లగా లేదనిపిస్తోంది
బాధ రంగు నలుపు కాని
ఆ నలుపు చుట్టు అల్లుకున్న వెలుగుని కొంతమందే చూస్తారు

ఆలోచిస్తే
మన విజ్ఞానం
నల్ల బల్ల నుండి నల్లని రోదసీ దాకా నడిపించేది
నలుపేగా

రాత్రి
ఓ తపస్సమాధి
అది చూపే అద్భుతాలు
అది పెట్టే ఆలోచనల కిలలు
అది పంచే అమృత ధారలు
ఏకాంతంలో ఎవరికి వారు
స్పృశించే
అనుభవైకవేద్యాలు –

***

## తీరం చేరేదాకా..

### క్రాంతికుమార్ మలినేని

కన్నీటి మసకున్నా
కన్ను చూడాల్సింది
కొట్టాల్సిన పిట్ట కన్నునే

రెండే మెతుకులు గతికైనా
పాదం నిలవాల్సింది
లక్ష్యం చేరాకనే

గతుకుల దారైనా
పయనం ఆగాల్సింది
గుండె ఆగినాకనే

కట్టెల చితికైనా
దేహం చేరాల్సింది
కలలు తీరాకనే

తీరం చేరేదాకా
మిణుగురల్లే వెలుగుతూ
ఎగురు ఆనంతాలకి
నక్షత్రమై మిగిలిపోతావ్

★★★



## కురిసి చిత్తడైన అర్థాలలో

### శ్రీసాహితి

జోరున కురుస్తున్న గొంతులో
ఇరుక్కుని మొదటి వాక్యం
చిరిగి గాయమై కుంటుతూ
అక్కడక్కడే తిరుగుతుంది.

వేళ్ళ రాపిడిలో
ఒళ్ళు నలిగిన పేజీలు
ఒకటినొకటి నడుములు వంగినా
భుజాలపై చేతులు వేసుకుంటూ

ఆఖరి అక్షరం వద్ద
చివరి పేజీ చూరు చేరి
కురిసి చిత్తడైన అర్థాలలో
వెనక్కి చూస్తున్నాయి..

ఎవరిమనసులోనైనా
మెతకపడ్డ ముద్రల్ని కనిపిస్తే
చెవుల కరుచుకుని
తనను విని పొంగాలని

ముఖచిత్రం మొత్త చాటుగా
మెత్తగా ముడుచుకు కూర్చొంది
కన్నీటి ముడిద్రవంగా
మలిగిన అనుభవం...

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

దినకరుడు పడమటి మెట్లు దిగెడు వేళ
తరణి కాంతులు మెల్లన తగ్గు వేళ
రాత్రి యింకను పూర్తిగ రాని వేళ
వింత శోభలు వినువీధి వెలయు వేళ

సాగు రవి కడపటి యనుచరుల యట్లు
బహుళవర్ణముల్ నిండారు పశ్చిమమున
అరుణకిరణుండు కనుమరుగైన వెనుక
కనుల పండువై శుక్రుండు కానుపించు

అమరతారకలు గ్రహములంబరమున
కనులకామెతనెంత కూర్చిననుగాని
వానికెల్ల శుక్రుడు తలమానికమ్ము
కాంతిపుంజమై తనరు నాకసమునందు

ఇంత యానందమును మనకెరుక చేసి
యంతలో యుడువీధి తానరుగునెటకో
రేయి యెల్లను కనువిందు చేయబోడు
మరల వత్తునటంచును మాట యొసగు

వచ్చు ప్రాగ్దిశన్ మరల ప్రభాతమందు
ఇనుని రాకనెల్లజనులకెరుగజేయ
ఎన్ని మారులు చూచిన కన్నులార
మరల మరలనా ద్యుతి గాంచ మనసు పడమె!

COMMENTS